# భూమిపుత్రుడు

"ఎంత? అవతలి వ్యక్తి చెప్పిన అంకె విని హడలిపోయాడు సురేంద్ర.

" మరో బేరం ఏమన్నా ఉందా?"

"మీ రెంతదాకా వస్తారో చెప్పండి"

బాగా ఆలోచించి సురేంద్ర తన అంకె చెప్పాడు.

" సారీ, ఆ రేటు చాలా పాతది. సలీసుగా మా భూముల్ని కొందామని వచ్చినట్లుంది. కానీ మాకూ మా భూమిమీద ఆశలుంటాయి కదా? ఆ ధరకు ఇవ్వలేము."

సురేంద్ర లాడ్జికి తిరిగి వచ్చాడు.

పదేళ్ల క్రితం సురేంద్ర బీదవాడు. తండ్రి చనిపోయేనాటికి ఏదో చిన్న ఉద్యోగం చేస్తుండేవాడు. తండ్రి పోయాక వ్యవసాయాన్ని చేపట్టాడు. అతని కున్న భూమి స్వల్పమే అయినా, కష్టించి పని చేశాడు.

వందల ఎకరాలున్న భూ కామందులు ఆ సంవత్సరం వేలం వెర్రిగా పత్తి పంట చేస్తుంటే, అతను సాహసం చేసి తన భూమిలో పొద్దు తిరుగుడు పంటవేశాడు. అందరూ పొద్దు తిరుగుడు కొచ్చినప్పుడు అతను నువ్వుల పంట వేశాడు. చేనును ప్రాణంలా చూచుకున్నాడు.

అదృష్టం బాగుండి అతను ఏ పంట పండిస్తే ఆ పంటకు ధరలు కూడా బాగా పలికాయి. ఎక్కడి కెక్కడికో వెళ్ళి సలీసుగా భూములు కొన్నాడు.

ఇలా అతను ఎక్కడ చేయి పెడితే అక్కడ బంగారం.

అతనిప్లాన్స్ ఎప్పుడూ తప్పలేదు.

మొట్టమొదటిసారి ఇప్పుడు తప్పింది.

ఆంధ్రానుండి అన్ని పనులూ వదులుకొని ఎక్కడికో వచ్చింది వట్టి చేతులతో పోవటానికా? అతని మనసు బాధతో గిలగిల కొట్టుకుంది.

ఆ బాధతోనే లాడ్జికి వచ్చాడు. కావాలంటే తిరుగు ప్రయాణమై వెళ్ళిపోవచ్చు.

కానీ అతనికి ఇక్కడి శ్రమను, బాధను ఇక్కడే మర్చిపోవాలని పించింది.

వెయిటర్ని పిలిచి డ్రింక్స్‌కి ఆర్డర్ ఇచ్చాడు.

అతను ఆల్కహాలిక్ కాదు. మనసు మరీ బాధతో క్రుంగిపోతున్నప్పుడు మాత్రమే తాగుతాడు.

" సర్, ఇంకా ఏమైనా కావాలా?" భావయుక్తంగా అడిగాడు వెయిటర్. " రాత్రంతా మీ సేవ

సురేంద్ర అలా ధైర్యం చేసి అడుగుతాడనుకోలేదు ప్రభావతి.

"కాలేజీలో అభ్యుదయ దృక్పథంగల గాల్స్‌లో మీ రొకరని నాకు తెలుసు. అందుకే ధైర్యం చేసి నేరుగా అడిగేశాను. మిమ్మల్ని గురించిన వివరాలన్నీ నాకు తెలుసు. నన్ను గురించి..."

సురేంద్ర ఆ కాలేజీలో డాషింగ్ హీరో, స్మార్ట్‌కింగ్.

"మీరు చెప్పనక్కర్లేదు. మిమ్మల్ని గురించి నాకంతా తెలుసు. అందుకే మీ ప్రపోజల్‌ని నేను తిరస్కరిస్తున్నాను".

"అంటే - మన కులాలు వేరు కావటం కారణమా?"

" కాదు "

" మీ పెద్దలు అంగీకరించరన్న భయమా?"

" ఊహూ".

"మీరు మరెవరినైనా ప్రేమిస్తున్నారా?"

"నే నెవరినీ ప్రేమించలేదు."

" మరి నన్ను కాదనటానికి కారణం తెలుసుకోవచ్చునా?"

"మీరు బాధపడతారు. కారణం తెలుసుకొని భరించలేరు."

" అయినా సరే. చెప్పండి. ప్లీజ్!"

" కులం, ధనం, అందం.... వీటన్నిటికన్నా నేను గుణానికి ప్రాధాన్యమిస్తాను. శీలం అన్నది స్త్రీకి ఎంత అవసరమో పురుషుడికీ అంత అవసరమేనని నా విశ్వాసం. పెళ్ళికి ముందే అనేకమంది వేశ్యలతో అనుభవమున్న పురుషుడు ఎంత గొప్పవాడైనా నా భర్త కాలేడు."

" ఓ ! అయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ ప్రభా. నాకున్న ఒకే ఒక్క బలహీనత నా జీవితానికే శాపం కావటం నా దురదృష్టం. మీరు చెప్పి కారణం విన్నాక నా మీద నాకు అసహ్యం వేస్తున్నది. మీ పైన ప్రేమ, గౌరవం పెరిగాయి. థాంక్యూ!"

దృశ్యాలు మాయమయ్యాయి.

ఇద్దరి కళ్ళలో నీళ్ళు.. లజ్జ!

" ప్రభా. మీరు.. ఇక్కడ...? మిమ్మల్ని ఈ స్థితిలో చూస్తానని కలలో కూడా అనుకోలేదు."

" మనం అనుకోనివి ఎన్నో జరుగుతుంటాయి సురేంద్రగారూ." మేన్ ప్రపోజెస్.. గాడ్ డిస్పోజెస్' అని అందుకే అన్నారేమో! ఒకనాడు మీరు పెళ్ళిచేసుకోమని అడిగితే కాదన్నాను. ఇవ్వాళ మీకు కావల్సింది ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాను. ఒక్కటి తప్ప.."

"ఆ ఒక్కటి ఏమిటి?"

"మీరు తాగుబోతు కూడా అని నా కానాడు తెలియదు. తాగుడంటే నాకు అలర్జీ. దయచేసి తాగమని నన్ను బలవంతం చేయకండి."

"ఓ !" అంటూ అతను టేబుల్‌మీద ఉన్న బాటిల్‌ను, గ్లాసుల్ని తీసుకెళ్ళి బయట పారేసి వచ్చాడు.

"థాంక్స్ ఎలాట్, ఇక లైట్స్ ఆఫ్ చేయనా?"

"ప్రభా, వ్యభిచరించే పురుషుడంటేనే నీకు అసహ్యం కదా? మరి నువ్వు వ్యభిచారిణి వెలా అయ్యావ్? వ్యభిచారిణిగా ఎలా జీవించగలుగుతున్నావ్?"

"జీవచ్ఛవంలా ! చావలేక."

"కానీ ధనం, విద్య, అందం అన్నీ ఉన్న దానివి. నీకీ స్థితి ఎలా వచ్చింది? ఎందు కొచ్చింది? పెళ్ళి చేసుకోలేదా?"

'చాలామంది ఆడవాళ్ళకి ఈమధ్య ఇలాంటి పరిస్థితి వచ్చింది. అందుకు కారణం పత్తిపంట.'

"పత్తి పంటా ! వివరంగా చెప్పు ప్రభా ! ప్లీజ్."

ఆమె శూన్యంలోకి అలాగే నిర్వికారంగా చూస్తూ తన కథ చెప్పసాగింది.

★ ★ ★

"నా చదువు అయిపోయి ఇంటి కెళ్ళగానే మా నాన్న నాకు పెళ్ళి సంబంధాలు చూడసాగాడు.

"అమ్మా ! నువ్వు చదువుకున్నదానివి. నీ కెలాంటి భర్త కావాలో తెలుసుకోవటం నా ధర్మ మనుకొంటున్నాను. ఐ మీన్ - ఇంజనీర్స్, టెక్నోక్రాట్స్, డాక్టర్స్, టాప్ అడ్మినిస్ట్రేటర్స్, ఇండస్ట్రియలిస్ట్, అగ్రికల్చరిస్ట్స్.... నీ భర్త ఏ ప్రొఫెషన్‌లో ఉండాలని నీ కోరిక,"

"ఎవరైనా పర్వాలేదు నాన్నా. ఆ మంచి చెడ్డలు మీరే చూడండి. నాకు ఆ విషయంలో ప్రత్యేక అభిరుచులంటూ ఏమీ లేవు. కానీ నేను కోరుకొనేది ఒక్కటే. నా భర్త తాగుబోతూ, తిరుగుబోతూ అయి ఉండకూడదు. శీలవంతుడయి ఉండాలి."

అంతవరకు నాన్న దృష్టి విదేశాల్లో సంబంధాల మీద, మహానగరాల్లో సంబంధాల మీద ఉండేది. నా కోరిక విన్నాక ఆయన దృష్టి మారింది.

"అమెరికాలోనో, లండన్‌లోనో, ఢిల్లీలోనో, బొంబాయిలోనో ఉన్నవాడు తిరుగుబోతు, తాగుబోతు అవునో కాదో తెలుసుకోటం ఎలా? తాగటం, అడ్డమైన తిరుగుళ్ళూ తిరగటం ఫాషన్‌గా మారిన రోజులు కదా? పెద్ద సంబంధా లనుకొని ఎవరికో ఇచ్చి చేస్తే, రేపు పిల్ల కాపురాని కేమైనా అవుతే మనం ఏడవాలి. మనకు దగ్గర్లో, బాగా తెలిసిన సంబంధాలే చూస్తాను" అమ్మతో నాన్న అనటం నేను విన్నాను.

ఎందర్నో చూడగా చూడగా చివరకి శివరాంతో నా పెళ్ళి నిశ్చయమయింది.

శివరాం నాలా గ్రాడ్యుయేట్ కాదు. ఇంటర్ చదువుతూ మానేశాడు. చదువు అతనికి ఎప్పుడూ

వంటబట్టలేదు. ఎందుకంటే అతను పరహారణాల రైతుబిడ్డ.

పొద్దున్నే ఇంత సంకటిలో మజ్జిగ పోసుకొని తాగటం, పశువుల్ని తోలుకుంటూ పొలాని కెళ్ళటం, స్వయంగా నాగలిపట్టి పొలం దున్నటం, కలుపు తీసుకోవటం, పగలంతా చెమటోడుస్తూ పని చేయటం, రాత్రిళ్ళు కూడా అవసరమైతే పొలంలోని కొట్టంలోనే పడుకోవటం. .... ఇలాంటి పనులంటే అతనికి ప్రేమ.

"చల్లటి నీడలో, ఫాన్ల గాలి కింద నేను పని చేయలేను ప్రభా. నాకు ఎర్రటి ఎండ... మట్టి వాసన లేకపోతే తోచదు. నువ్వు చదువుకొన్నదానివి. నువ్వు నన్ను చేసుకొని ఏం సుఖపడతావ్?" అని పెళ్ళికి ముందు అతను నాతో అన్నాడు.

నాకు అతని నిజాయితీ నచ్చింది. అతనే నాకు తగిన భర్త అనిపించింది.

అతను నిజమైన భూమి పుత్రుడు. తెలుగుదేశంలో రైతు కుటుంబాల సంస్కృతికి వారసుడు.

శివరాంతో పెళ్లయ్యాక అతడిని గురించిన మరిన్ని వివరాలు తెలిశాయి.

అతను పరస్త్రీలను కన్నెతి కూడా చూడడు.

మద్యం కాదు కదా కాఫీ, టీలను కూడా తాగడు.

అంబలే అతనికి అమృతం.

అయితే అతని కున్న ఒకే ఒక్క బలహీనత - ఆశ

రైతుగా తను రాణించాలి. తన కష్టానికి తగిన ప్రతిఫలం పొందాలి. ఏమీ కష్టపడకుండా వ్యాపారస్తులు లక్షలు లక్షలు సంపాదించటమేమిటీ? మట్టిని నమ్ముకొని చెమటోడ్చి పని చేసే రైతు ఎదుగూ బొదుగూ లేకుండా ఉండట మేమిటి?

తను కూడా లక్షలు సంపాదించాలి.

వ్యాపార పంటలు పండిస్తేనే అది సాధ్యం.

పత్తిని నమ్ముకొన్నా డతను.

మొదటి సంవత్సరం బాగా లాభాలొచ్చాయి.

అతడిని చూసి అంతా పత్తి పంట వేశారు.

కొన్నాళ్ళు లాభాలు బాగా వచ్చాయి.

అయితే ఉన్నట్లుండి ఒక సంవత్సరం పంటకు చీడ పీడలు పట్టి దిగుబడి బాగా దెబ్బతింది. పండిన పత్తి కూడా నాణ్యమయింది కాదు. అతను క్రుంగిపోయాడు.

అప్పటికి మాకు ఇద్దరు పిల్లలు పుట్టారు.

శివరామ్ ఎప్పుడూ పిల్లల భవిష్యత్తును గురించి కలలు కనేవాడు. పిల్లలు... నేను.... పొలం... పంట. ఇవి తప్ప మరి దేన్నీ పట్టించుకునేవాడు కాదతను.

"ఈ సంవత్సరమన్నా గత సంవత్సరం వచ్చిన నష్టాన్ని పూడ్చుకోవాలి ప్రభా. లేకపోతే పిల్లలకు అన్యాయం చేసినవాడి నవుతాను".

"ఆశకు అంతెక్కడండీ? పత్తి పంటను కాకుండా మరో పంట వేస్తేనేం?"

"ఆ పని పోయిన సంవత్సరం చేస్తే ఎలాగుండేదో ! కానీ ఇప్పుడు లాభం లేదు. మరో పంట వేసి వచ్చిన నష్టాన్ని పూడ్చుకోవటం అసంభవం. పత్తి, పొగాకు, పసుపు పంటల్లాంటి వాణిజ్య పంటల్లో వచ్చిన నష్టాలని ఆ పంటలే పూడ్చగలవు."

ఎంతో ఖర్చు పెట్టి చీడపీడల మందుల్ని వేశాడు. పొలంలో మొక్కల్ని కన్నబిడ్డల్లా చూసుకున్నాడు. అయినా మహమ్మారిలా ఏదో తెగులు పత్తిపంటను పట్టుకొంది. మందులేవీ పని చేయలేదు.

అందరి పంటలూ సర్వనాశనం అయ్యాయి. గుడ్డిలో మెల్లన్నట్లు శివరాంకే దిగుబడి బాగా వచ్చింది.

అయితే ఆ సంవత్సరం పత్తి కొనుగోలు ధర బాగా పడిపోయింది. నాణ్యమైన పత్తి కాదని ఎవరూ కొనలేదు.

మూడో సంవత్సరం కూడా పత్తి రైతులు మోసపోయారు. ధనమంతా కరిగిపోయింది. అప్పులు పెరిగిపోయాయి. సమాజంలో పరువు పోయినట్లయింది.

ఈ స్థితిని తట్టుకోలేని వారు చీడపీడల్ని సంహరించటానికని తెచ్చుకొన్న మందుల్ని తామే తాగారు.

చీడపీడల్ని సంహరించటంలో విఫలమైన ఆ మందులు మనుషుల్ని మాత్రం నిముషంలో పొట్టన పెట్టుకొన్నాయి.

మూడేళ్ళు వరుసగా దెబ్బమీద దెబ్బ....

శివరాం నడుము విరిగింది. అయినా అతను అధైర్యపడలేదు.

అయినకాడికి పొలాల్ని అమ్మేసి అప్పులు తీర్చాడు. మిగిలిన డబ్బుతో ఇక్కడి కొచ్చాడు. ఇక్కడ చీప్‌గా భూమిని కొని పత్తి పంట వేశాడు మళ్ళీ.

"ఇక్కడ కూడా మళ్ళీ పత్తి పంటేనా? వద్దండీ"

నే నెంత చెప్పినా అతను వినలేదు.

"పత్తి పంటను నేను జయించటమో, అది నన్ను సర్వనాశనం చెయ్యటమో ఈ దెబ్బతో తేలిపోవాలి. నాకు అడ్డం రాకు" పౌరుషంగా అన్నాడు.

శివరాం పత్తిమీద కచ్చపడ్డే పత్తి పంట కూడా మా కుటుంబంపైన కచ్చపట్టినట్లుంది. నాలుగో సంవత్సరం ఇక్కడ కూడా మోసం చేసింది.

వ్యవసాయం కోసం చేసిన ఋణాలు మిగిలాయి. భూమిని అమ్మితే కానీ తీర్చే దారి లేదు.

శివరాంకి పిచ్చెక్కినట్లయింది. ఏ అఘాయిత్యం చేస్తాడో నన్న భయం పట్టుకొంది నాకు. కంటికి

రెప్పలాగా అతడిని కనిపెట్టుకొనే ఉన్నాను.

అయినా......ఆ రాత్రి........ఆ రాత్రి......

గాఢ నిద్రలో ఉన్నట్లు నటించి, నేను కాస్త నిద్రలోకి జారుకోగానే లేచి ఎండ్రిన్ తాగాడు.

తెల్లారేసరికి అతను లేడు. పిల్లలతో నేను రోడ్డు మీద పడక తప్పలేదు. నాన్న దగ్గరి కెళ్తే ఆయన నన్ను ఆదరిస్తాడు.

కానీ ఇంత జరిగాక ఎలా వెళ్ళడం? శివరాం సాహచర్యంలో అతని అభిమానం నాక్కూడా కాస్త అంటుకొన్నట్లుంది.

శివరాంలా చావాలన్న ఆలోచన కూడా రాలేదు.

ఎందుకంటే చచ్చేది పిరికివాళ్ళని నా విశ్వాసం.

భర్తగా, తండ్రిగా తన ధర్మాన్ని విస్మరించిన శివరాం పనిని నేను ఎన్నటికీ క్షమించలేను.

తల్లిగా నా ధర్మాన్ని విస్మరించను. బ్రతుకుతాను. స్వంత కాళ్ళమీద నిలబడి నా బిడ్డల్ని పెంచి పెద్ద చేస్తాను.

ఆ పట్టుదలతో ఉద్యోగపు వేటలో పడ్డాను.

కానీ ఆడదానికి రక్షణ లేని కాలం. హక్కులు హక్కులు అని ఒక వైపు అరుస్తూనే వ్యాపార సంస్కృతిలో ఆడదాన్ని ఆటబొమ్మలా చూస్తున్న సమాజం.

నన్ను ఎన్ని వేల కళ్ళు వెంటాడాయో? అనాధనని తెలిసి ఎన్ని శరీరాలు నన్ను అత్యాచారం చెయ్యబోయాయో?

పోరాడి పోరాడి తల వంచి ఈ ఉద్యోగంలో స్థిరపడక తప్పలేదు.

★ ★ ★

ప్రభావతి కథ చెప్పటం ఆపి గాఢంగా నిట్టూర్చింది.

చాలాసేపు ఆ గదిలో నిశ్శబ్దం తాండవించింది.

"ఏమిటలా కూర్చున్నావు మౌనంగా, పొద్దుపోతోంది" స్విచ్‌పైన చెయ్యి వేసి అన్నదామె.

"లైట్లు ఆర్పకు. అలా కూర్చో" ఛటుక్కున లేచి ఆమె చెయ్యి పట్టుకొని కూర్చోపెడుతూ అన్నాడు.

"తప్పు చేస్తున్నానన్న భావన ఉన్నప్పుడు నేను లైట్లార్పి ఆ పనిని చేస్తాను. చీకట్లో కూర్చుని తాగిందందుకే. కానీ నేనిప్పుడు ఏ తప్పూ చేయబోవటం లేదు. అందుచేత మరోలైటు కూడా వేస్తాను" అంటూ అతను మరొక స్విచ్ ఆన్ చేశాడు.

"అవునులెండి. వ్యభిచారం మీ దృష్టిలో తప్పెలా అవుతుంది? అలవాటు అయిన విద్య కదా?"

అతను చివ్వున తల తిప్పి ఆమె వైపు చూశాడు. అంతలోనే కోపాన్ని నిగ్రహించుకున్నాడు.

"ఇప్పుడు మనం ఒకర్నొకరు ఎత్తిపొడుచుకొని లాభం లేదు ప్రభా. బలహీనతను కంట్రోల్ చేసుకోలేక నేను చిన్నప్పటి నుంచి చెడ్డాను. నువ్వు బతకడం కోసం ఇప్పుడు చెడ్డావు. అయినా ఫలితాంశం ఒక్కటే. ఇద్దరం చెడిపోయిన వాళ్ళం. వ్యభిచారులం. ఇప్పుడు జరగాల్సిందేమిటో ఆలోచించటం మంచిది కదా?"

"ఆలోచించటానికేమైనా ఉందా? ఈ రాత్రికి మీరు నన్ను కొనుక్కున్నారు."

'ప్రభా! పదే పదే అలాగని నా సహనాన్ని పరీక్షించకు. నేను మాట్లాడుతున్నది 'ఆ విషయం' గురించి కాదు. ఈ రాత్రికే కాదు. శాశ్వతంగా నిన్ను నాదాన్ని చేసుకొనే విషయం ఆలోచిస్తున్నాను.'

"జాలా! సానుభూతా?"

"రెండూ కాదు. ప్రేమ - మమకారం."

"ఓ! అయితే నన్ను పర్మినెంట్‌గా 'ఉంచు' కొంటారా?"

"ఛీ! కాదు. పెళ్ళి చేసుకుంటాను."

"పెళ్ళా! నన్ను? ఈ వ్యభిచారిని? రెండో పెళ్ళా?"

"వ్యభిచారివి కనుకనే చేసుకోవాలనుకుంటున్నాను. ఎందుకంటే ఇప్పటికైనా నువ్వు నాలోని ఆ ఒక్క అవగుణాన్ని క్షమించి సర్దుకుపోతావన్న ఆశతో. వ్యభిచరించాల్సిన అవసరం ఇక మనిద్దరికీ ఉండకూడదన్న సంకల్పంతో......"

"మరి మీ భార్య నేం చేస్తారు. నన్ను ఉద్ధరించటం కోసం ఆమెకు ద్రోహం చేస్తారా?"

"ప్రభా! నా కసలు పెళ్ళి కాలేదు. చేసుకోలేదు."

"అంటే.....నువ్వు...."

"అవును ప్రభా! ప్రేమించిన వారిని తప్ప పెళ్ళి చేసుకోకూడదన్నది నా నియమం. అసలు వ్యభిచారం కన్నా, మానసిక వ్యభిచారం మరింత పాపమని నా విశ్వాసం."

"సురేంద్రా!" ఆమె అతని చేతుల్ని పట్టుకుని కళ్ళలోకి ఆరాధనగా చూసింది. అతని కళ్ళలో నీళ్ళు!

"ఏడుస్తున్నారా? నా కోసం."

"ఈ కన్నీరు నీ కోసం కాదు ప్రభా! నా సోదర భూమిపుత్రుడు శివరాం కోసం.'

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 8-2-89